క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ విశ్వాసంతో ముందుకు సాగాలి



ఫిరంగిపురం: ప్రతిఒక్కరూ విశ్వాసంతో ముందుకు సాగాలని విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పవిత్ర దీక్షాధారణ పూజల్లో భాగంగా శనివారం దివ్యపూజా బలి నిర్వహించారు. భగవంతుడు మనకు ఇచ్చిన మానవదేహం ద్వారా మంచికార్యాలు చేయాలని చెప్పారు. అనంతరం దివ్య పూజాబలి నిర్వహించారు. కీర్తనలు ఆలపించారు.

కాశీవిశ్వేశ్వరుడికి ఉత్సవ పూజలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని విశాలాక్షీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఉదయాన్నే అర్చకులు రావూరి పూర్ణనందశాస్త్రి, ఆంజనేయశాస్త్రి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అంకురారోహణ, దీక్షాధారణ పూజలు చేశారు. అనంతరం 108 బిందెలతో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. అభిషేకాలు చేసి స్వామిని అలంకరించారు. సాయంత్రం కలశస్థాపన చేసి యాగశాలలో ప్రవేశించి అగ్నిప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణ పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కేఎల్‌యూలో ముగిసిన టెక్నికల్ ఉత్సవాలు



మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆయా విభాగాలలో నిర్వహించిన టెక్నికల్ ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ టెక్నో కల్చరల్ ఫెస్ట్ స్పార్క్-2024 ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వే ఎలక్ట్రికల్ ఇంజినీర్ రవితేజ హాజరయ్యారు. కేఎల్‌యూ పూర్వ విద్యార్థి ఏపీ సెక్రటేరియట్ ఏఎస్ఓ హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే రామకృష్ణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్‌లు డాక్టర్ ఏ పాండియన్ పాల్గొన్నారు.

3న ఉచిత సామూహిక ఉపనయనాలు

గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 3న ఉచిత సామూహిక ఉపనయనాలు చేస్తున్నట్లు సేవాసమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ చెప్పారు. ఈమేరకు శనివారం స్థానిక బ్రాడీపేటలోని సేవా సమితి కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఉపనయనాలు చేయించుకునే వారు మార్చి 25న సాయంత్రం లోపు బ్రాడీపేట 1వలైనులోని బ్రాహ్మణ సేవాసమితి కార్యాలయంలో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. కేవలం బ్రాహ్మణులకు మాత్రమే ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కమిటీ కన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ 9440041241, కమిటీ కార్యాలయం 7013256879 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాతూరి మురళీమోహన్‌రావు, వి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎంటీఎంసీలో పన్ను వసూలు వేగవంతం

- సెలవు రోజుల్లోనూ చెల్లింపునకు అవకాశం
- మొండి బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి
- విలీన గ్రామాలలో మందకొడిగా వసూలు
- నెలాఖరుకు లక్ష్యం పూర్తి చేస్తామంటున్న అధికారులు

మంగళగిరి: మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పడి మూడేళ్లు అయింది. కార్పొరేషన్ రాజధాని పరిధిలోని పట్టణం కావడంతో చాలా ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కూడా కార్పొరేషన్ పరిధిలోనే ఉంది. ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. తగిన విధంగా నిధులు కేటాయించింది. ప్రధానంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పథకాలతో పాటు కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం కీలకమే. దీంతో అధికారులు పన్నులు వసూలు వేగవంతం చేశారు. మార్చి నెలాఖరుకు పన్నులు వసూలు లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి వసూలు చేస్తుండగా అధికారులు రెవెన్యూ సిబ్బంది మొండిబకాయిలపై దృష్టి సారించారు.

వడ్డీ మాఫీతో ట్యాక్స్ పేయర్స్ నుంచి స్పందన..

మార్చి నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందని లేదంటే వడ్డీతో కలసి చెల్లించాల్సి ఉంటుందని అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. నగరంలో మైకు ప్రచారం చేయిస్తున్నారు. కార్పొరేషన్ అభివృద్ధి జరగాలంటే పన్నులు యజమానులు ఇంటిపన్ను తాగునీటి పన్నులు చెల్లించి సహకరించాలని కోరుతున్నారు. దీంతో అత్యధిక శాతం మంది స్పందించి పట్టణవాసులు ముందుకు వస్తున్నారు. అయితే విలీన గ్రామాల నుంచి ఆదరణ తక్కువగానే ఉంది.



నగర పాలక సంస్థ కార్యాలయంలో పన్నులు చెల్లిస్తున్న యజమానులు

పన్ను వసూలు ఇలా...

- కార్పొరేషన్ పరిధిలో 78,062 నివాసాలున్నాయి. వాటి నుంచి రూ.31.85 కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉంది.
- ఈ నెల 22వ తేదీ వరకు రూ.19.50 కోట్లు వసూలు అయ్యాయి.
- మరో రూ.12.35 కోట్లు ఈ నెలాఖరునాటికి వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

కమిషనర్ నిర్మల్ కుమార్ ఏమన్నారంటే...

ఈ నెలాఖరు నాటికి పన్ను వసూలు లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మొండి బకాయిలు వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్పొరేషన్ అభివృద్ధి చెందాలంటే ప్రజలు పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

- మంగళగిరి పట్టణంలో 18,630 నివాసాలుండగా రూ.8.97 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ 6.45 కోట్లు వసూలు చేయగా రూ.2.50 కోట్లు బకాయిలు ఉన్నాయి.
- మంగళగిరి విలీన గ్రామాలలో 23,396 నివాసాల నుంచి రూ.8.40 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.3.90 కోట్లు వసూలు కాగా రూ.4.50 కోట్లు వసూలు కావాల్సి ఉంది.
- తాడేపల్లి పట్టణంలో 19,551 నివాసాల నుంచి రూ.8.82 కోట్లు పన్నులు చెల్లించాల్సి ఉండగా రూ.6.40 కోట్లు వసూలు చేశారు. రూ 2.42 కోట్లు బకాయిలున్నాయి.
- తాడేపల్లి విలీన గ్రామాలలో 16,485 నివాసాల నుంచి రూ.5.66 కోట్లు రావాల్సి ఉండగా రూ.2.80 కోట్లు వసూలు కాగా రూ.2.80 కోట్ల బకాయిలున్నాయి.

రాజకీయ పార్టీల ప్రచారాన్ని క్షుణ్ణంగా వీడియో తీయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

జేసీ రాజకుమారి

మంగళగిరి: రాజకీయ పార్టీల ప్రచారాలను క్షుణ్ణంగా ప్రతి అంశాన్ని వీడియో తీయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ రాజకుమారి కోరారు. నగరంలోని కార్పొరేషన్‌లోని ఎన్నికల కార్యాలయంలో శనివారం వీడియో నిఘా బృందం, వీడియో పోలీస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు వారి ఎన్నికల ప్రచారం నిమిత్తం కొన్ని అనుమతులు పొంది ఉన్నారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్వహించే ప్రచారాన్ని వీడియో నిఘా బృందం, పోలీస్ సిబ్బంది వీడియోలను తీసి ఎన్నికల వ్యయ పరిశీలనకు పంపించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని అలసత్వం వహించవద్దని ఆదేశించారు.

107 కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలతో 'మణిపాల్' రికార్డు

మంగళగిరి: నగర పరిధిలోని తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రి రెండు సంవత్సారాలలోనే 107 కోక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలతో రికార్డు సాధించినట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన సర్జరీలలో 60 ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకు సర్జరీ నిర్వహించి వినికిడి లోపం లేకుండా చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్జరీ స్పెషలిస్టు డాక్టర్ వీవీకే సందీప్, డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుచరిత

మేడికొండూరు: మండలంలోని మేడికొండూరు, గుండ్లపాలెం, విశదల గ్రామాల్లో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మేకతోటి సుచరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేడికొండూరు ఇందిర కాలనీలో మరియమాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్కరిని పలుకరించారు. ప్రభుత్వం నుంచి ప్రతి ఇంటికి చేకూరిన లబ్ధి గురించి వివరించారు. అనంతరం గుండ్లపాలెం గ్రామానికి వెళ్లిన ఆమెకు మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి స్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. మరో సారి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ప్రతినెలా పింఛను తీసుకుంటున్న వృద్ధులను పలకరించారు. రానున్న ఎన్నికల్లో తమ మద్దతు వైఎస్సార్ సీపీకే ఉంటుందని వారు సుచరితకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, పార్టీ మేడికొండూరు గ్రామ అధ్యక్షుడు కొరివి చెన్నయ్య, దాసు, మేరమ్మ, లూర్దు రాజు, శాంతయ్య, కె.కిషోర్, ఉడతా శ్రీనివాసరావు, లూర్ధురాజు, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, బి.చినసాంబయ్య, భాగ్యరాజు, శివరామకృష్ణ, అల్లూరి శ్రీనివాసరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, కె.అజయ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



మంగళగిరి: వైఎస్సార్ సీపీలో పట్టణంలోని 23వ వార్డు నుంచి యువకులు భారీగా చేరారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన యువకులను లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పఠాన్ ఆష్రాఫ్‌ఖాన్(అశోక్), కలకోటి చక్రిల ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చి సభ్యులు మేకల రవికాంత్, ఎడ్లూరి వంశీ, కట్టెపోగు కార్తిక్, కొలకలూరి ప్రభుదేవకుమార్, మేకల ఉదయ్, మేకల కిరణ్‌లతో పాటు వంద మందికిపైగా యువకులు చేరారు.

లోకేష్, పెమ్మసానిలపై చర్యలు తీసుకోవాలి

జేసీ రాజకుమారికి ఫిర్యాదు

మంగళగిరి: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అంజుమన్ ఏ హిమాయిత్ ఇస్లామియా సంస్థ కార్యాలయంలో ప్రచారం నిర్వహించిన లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, మంగళగిరి అభ్యర్థి నారా లోకేష్‌లపై చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా కోరారు. ఈ మేరకు శనివారం ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారికి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఈ నెల 19వ తేదీన మతపరమైన వక్ఫ్ సంస్థలలో రాజకీయ ప్రచారానికి అనుమతిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయినా మంగళగిరి పట్టణంలో అంజుమన్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ టీడీపీ అభ్యర్థులు ప్రచారం నిర్వహించారన్నారు. వక్ఫ్ బోర్డు ఉత్తర్వులను ఉల్లఘించిన ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



జేసీ రాజకుమారికు ఫిర్యాదు చేస్తున్న ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరా

ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేక అధికారి గంగరాజు

మేడికొండూరు: రాజకీయ పార్టీ నేతలు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి గంగరాజు అన్నారు. మండల పరిధిలోని పేరేచర్ల సాయికృష్ణ కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిధిలోని రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. గంగరాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నేతలు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు. ఎన్నికల్లో వివిధ పార్టీల్లో పాల్గొనే అభ్యర్థులు వారి బ్యాంకు ఖాతాలు తెరిచి సంబంధిత అధికారులకు నామినేషన్ వేసేలోపు అందజేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పార్టీ నేతలు పాల్గొనే కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థి ఎంత ఖర్చు చేయాలో ఎన్నికల నిబంధనల ప్రకారం చేయాలన్నారు. ఎక్కువ ఖర్చు చేస్తే సంబంధిత అభ్యర్థి ధ్రువపత్రం రద్దు చేయడం జరుగుతోందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎలాంటి సమస్య ఉన్నా సహాయక చర్యల్లో భాగంగా 8125146794, 8074495632 నంబర్లలో సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. తుళ్లూరు డీఎస్పీ అశోక్‌గౌడ్ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ప్రజలను, రాజకీయ నేతలను కోరారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

మంగళగిరి: దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు భగత్ సింగ్ అని సీపీఎం నాయకులు కొనియాడారు. తాడేపల్లి పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జొన్నా శివశంకరరావు, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో ..

తాడేపల్లి పట్టణంలో సీపీఐ కార్యాలయంలో శనివారం భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంచర్ల కాశయ్య, వెంకటయ్య, ఖాశీం పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల సీపీఎం కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి బాలరాజు, నాగుల్ నాయక్, శ్రీను నాయక్, అమ్మిరెడ్డి పాల్గొన్నారు. తుమ్మపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో బి.చిరంజీవి, బి.సాంబశివరావు, కె.వాల్టిన్ రాజ్, జె.అజయ్ పాల్గొన్నారు.



తాడేపల్లిలోని సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాడికొండలో..

తాడికొండ: భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. స్థానిక గ్రంథాలయ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావు, గింజుపల్లి శ్రీనివాసరావు, బాణావత్ భద్రయ్య, సుంకర రాజు, ఎం.జోషి పాల్గొన్నారు.

పోషన్ పక్వాడ్‌పై అవగాహన

మంగళగిరి: తాడేపల్లిలోని సుందరయ్య నగర్‌లోని అంగనవాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ్-2024పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. తాడేపల్లి వైద్యాధికారి డాక్టర్ వి.శ్రీధర్ పాల్గొని బాలింతలు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంరక్షణకు పాటించాలని ఆహార నియమాలు, వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

తాడికొండ: పౌష్టికాహార లోపం లేని ఆరోగ్యవంతమైన భారతదేశం రూపొందించడమే పోషణ పక్వాడా లక్ష్యమని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్ వైజర్ కృష్ణకుమారి అన్నారు. పోషణ పక్వాడా పక్షోత్సవాల ముగింపు సందర్భంగా తాడికొండ-1 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వెల్‌బేబీ షో నిర్వహించారు. కార్యక్రమంలో హోమియో మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ హసీనా మాట్లాడారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే కె.శివకుమారి, ఏఎన్ఎం బి.విజయలక్ష్మి, పి.నజీమా పాల్గొన్నారు.

విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రంలో గత వారంరోజుల నుంచి జరుగుతున్న విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాధర్‌కుమార్ మాట్లాడారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు, ఏడీఏ పుణ్యవతి శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.దీప, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ అడ్డరోడ్డులో రూ.92 వేలు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు వద్ద చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా గుంటూరు భారత్‌పేటకు చెందిన వీర వెంకన్న వద్ద నుంచి కారులో రూ.92 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. విచారణలో ప్లాటుకు సంబంధించిన నగదు అని చెబుతుండగా అందుకు సంబంధించిన ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో అదుపులోకి తీసుకొని ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు ప్రకటించారు.



పొన్నవాహనంపై దర్శనమిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



హాజరైన భక్తులు

పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. పొన్నవాహనంపై చిన్నికృష్ణుడు అలంకరణలో శ్రీవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.

– మంగళగిరి